www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 15 అక్టోబర్ 2023
5
చిత్తూరు

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు వైభవంగా అంకురార్పణ జరిగింది. 15 నుంచి 24వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. గరుడవాహనసేవ రాత్రి 6.30 గంటలకు ప్రారంభమవుతుంది. శనివారం రాత్రి 7 నుండి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణం కార్యక్రమం నిర్వహించారు. అంకురాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణం అయ్యింది. చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి

ప్రసంగిస్తున్న ధనలక్ష్మి

వేదికపై సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు మరియం ధావలే, సామాజిక కార్యకర్త వసుంధర

మరియం ధావలేకు స్వాగతం పలుకుతూ...

2024 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి

స్కీం వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి / సిపిఎం రాష్ట్ర మహిళా సదస్సు డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'మహిళలంటే తనకు ఎనలేని గౌరవమని, అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటానని నిత్యం ప్రగల్భాలు పలికే సిఎం జగన్మోహన్‌రెడ్డి మహిళాభివృద్ధికి ఓ 'బటన్' నొక్కాలి' అని సిపిఎం రాష్ట్ర మహిళా సదస్సు డిమాండ్ చేసింది.. నవరత్నాలు ఇస్తున్నట్లే స్కీం వర్కర్లకు కనీస వేతనం 26వేలు ఇస్తూ బటన్ నొక్కాలన్నారు. దిశ చట్టానికి దశ దిశ లేకుండా పోయిందన్నారు. మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్న బిజెపికి ఒక్క ఓటు వేసినా చేటేనని సదస్సు ఉద్ఘాటించింది. మోడీకి చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్‌ను 2024 ఎన్నికల నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

'అసమానతలు లేని అభివృద్ధి' నినాదంతో తిరుపతి టిఎంఆర్ కల్యాణ మండపంలో రాష్ట్ర మహిళా సదస్సు సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. సదస్సుకు సిపిఎం జిల్లా కమిటి సభ్యురాలు పి.సాయిలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సిపిఎం కేంద్రకమిటి సభ్యురాలు మరియం థావలే ప్రసంగించారు. సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తూ మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్న కేంద్రంలోని బిజెపికి ఓటు వేస్తే మహిళలు వంటింటికే పరిమితమయ్యే ప్రమాదం ఉందన్నారు. బిజెపి హఠావో.. దేశ్‌కో బచావో అంటూ నినదించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు మోడీ పూనుకుంటే, అక్కడి ప్రజలు స్టీలుప్లాంట్‌ను రక్షించుకునేందుకు వెయ్యి రోజుల పైగా స్టీల్‌ప్లాంట్ ఉద్యమం చేయడాన్ని ప్రశంసించారు. దేశంలో ఆకలి సూచి పెరిగి, ప్రజలకు పౌష్టికాహారం లోపించి, రక్తహీనతతో బాధపడుతున్నారని, అయితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నేషనల్ సర్వే లెక్కలను సైతం దాచి పెడుతోందన్నారు. సామాజిక కార్యకర్త కె.వసుంధర మాట్లాడుతూ మహిళలు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. మహిళా సాధికారిత కావాలంటే విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, ఆరోగ్యం, రాజకీయ అధికారం, సాంఘిక సంక్షేమం కీలకమన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని తీసుకొస్తామని చెప్పిన సిఎం జగన్మోహన్‌రెడ్డి, లిక్కర్ బావరేజ్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 25 సంవత్సరాలు మద్యం పాలసీని తాకట్టు పెట్టి వారిచ్చే డబ్బుతో నాడు-నేడు, అమ్మఒడి, ఆసరా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. చంద్రయాన్ -3 విజయవంతమైన రోజే ఓ బాలిక అత్యాచారానికి గురై తీవ్ర రక్తస్రావంతో ఆదుకోవాలని వీధుల్లో అచేతన స్థితిలో తిరిగినా స్పందించలేని దౌర్భాగ్య స్థితిని మోడీ తీసుకొచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పేరుతో కార్పొరేట్ ఆస్పత్రులకు కోట్లు కుమ్మరిస్తున్న జగన్‌ప్రభుత్వం, పిహెచ్‌సిలను కార్పొరేట్ స్థాయికి ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి, సుబ్బరావమ్మ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక మహిళలపై అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు అధికమయ్యాయన్నారు. బిజెపి పాలిత ప్రాంతాల్లో సాక్షాత్తు ముఖ్యమంత్రులు, మంత్రులే నిందితులకు వత్తాసు పలుకుతూ మహిళలకు న్యాయం జరగకుండా అడ్డుకుంటున్నారని కొన్ని ఘటనలను వివరించారు. సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యురాలు డి.ధనలక్ష్మి మాట్లాడుతూ సనాతనం వైపా, సమసమాజం వైపా అన్నది మహిళలు తేల్చుకునే సమయం ఆసన్నమయ్యిందన్నారు. సనాతనం కావాలనుకునే మహిళలంతా భర్తలు చనిపోతే సతీసహగమనం చేయడం, వారి పిల్లలకు బాల్య వివాహాలు చేయడం చేస్తారా? అని ప్రశ్నించారు.

సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి, రాయపనేని హరిక్రిష్ణలు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం, సమసమాజం కోసం మహిళలు చేసే ఏ పోరాటానికైనా తమ సంఘీభావం ఉంటుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి పాటలు అందరినీ అలరించాయి. పాఠశాల, కళాశాల విద్యార్థులు చేసిన నృత్యాలు, సమసమాజ దిశగా వక్తల ప్రసంగాలతో మహిళా రాష్ట్ర సదస్సు విజయవంతంగా ముగిసింది.

అభివృద్ధి నిరోధకులను అడ్డుకుంటాం

టిటిడి ఉద్యోగసంఘాల మద్దతు

కరుణాకర్‌రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్న ఉద్యోగసంఘాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతిలో సుమారు లక్ష మంది టీటీడీ, అనుబంధ సంస్థల రెగ్యులర్, కాంట్రాక్టు, కార్పొరేషన్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు నివసిస్తున్నారని, తిరుపతిలో సుమారు 50 శాతం టీటీడీ ఆస్తులు ఉన్నాయని, టీటీడీ బడ్జెట్ లో ఒక్క శాతం నిధులు తిరుపతి అభివద్ధికి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి తాము అండగా ఉంటామని టీటీడీ లోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే శక్తులను బహిరంగంగా అడ్డుకుంటామని వారు చెప్పారు. ఉద్యోగులకు ఇంటి స్థలాలు మంజూరు చేయడం పట్ల శనివారం సాయంత్రం వారు చైర్మన్ ను ఆయన నివాసంలో కలిసి కతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎక్కడా లేని విధంగా ఒకే చోట సుమారు 650 ఎకరాల భూమి సమీకరించి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడం కరుణాక రెడ్డి కే సాధ్యం అయ్యిందని వారు చెప్పారు. టీటీడీ బడ్జెట్ లో తిరుపతి అభివద్ధికి 1 శాతం నిధులు కేటాయించడాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం ఒకరిద్దరు రాజకీయ పార్టీల నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడం దురదష్టకరమన్నారు. ఈ అభివద్ధి టీటీడీ ఉద్యోగులకు, యాత్రికులకు ఉపయోగకరమన్నారు. పారిశుధ్య కార్మికులకు 5 వేల దాకా, కార్పొరేషన్ ఉద్యోగులకు 3 శాతం జీతం పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నారనిఅభినందించారు. టిటిడి చైర్మన్ కరుణాకర రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల తనకున్న ప్రేమ, అభిమానం వల్లే తాను ఈ నిర్ణయాలు తీసుకున్నానని చెప్పారు. ఉద్యోగులందరికీ ఎప్పుడూ అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి లోని టీటీడీ ఆస్తులపైన మున్సిపల్ కార్పొరేషన్ ఒక్క రూపాయ కూడా పన్ను వేయడం లేదనే విషయం కూడా అందరూ గుర్తించాలని కోరారు. అలాగే టీటీడీ సంస్థలు, నివాస ప్రాంతాలకు మున్సిపల్ కార్పొరేషన్ ఉచితంగా నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి అభివద్ధి, భక్తుల సదుపాయాల అభివద్ధి విషయాల్లో టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్ పరస్పర సహకారంతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

తిరుపతి వ్యతిరేకి బిజెపి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దేశవ్యాప్తంగా నిధులు వెల్లువలా తరలిపోతుంటే నోరు మెదపని బిజెపి, తిరుపతి అభివృద్ధికి టిటిడి నిధులు ఒక్క శాతం కేటాయిస్తే తల్లడిల్లిపోతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో విమర్శించారు. తిరుపతి నగరం అభివృద్ధి చెందడం అంటే టిటిడి అభివృద్ధి కావడమేనని, నగరం ఎంత విస్తరిస్తే టిటిడికి అంత లాభదాయకమని అన్నారు. పెరటాసి మాసంలో రెండు లక్షల మంది భక్తులు కొండమీదకు వస్తే నిర్వహించలేక అధికార యంత్రాంగం భీతిల్లిన మాట వాస్తవమని, తిరుపతి నగరంంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక, వినోదాత్మక కార్యక్రమాలు పెరగాల్సిన అవసరాన్ని సూచిస్తోందన్నారు. స్మార్ట్‌సిటీ నిధులు మున్సిపాలిటీలకు ఇస్తున్నది రుణమే కాని కేంద్రం దయాదాక్షిణ్యం కాదన్నారు. దేశంలోని అన్ని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ఇచ్చారన్న వాస్తవాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. తిరుపతి నగరాభివృద్ధికి కేంద్రం అదనంగా ఇచ్చింది ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. తెలుగుదేశం, వైసిపి, జనసేనలతో అపవిత్ర బంధాన్ని బిజెపి ఏ పద్ధతిలో సాగిస్తుందో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలుసన్నారు. టిటిడి చట్టానికి వ్యతిరేకంగా తిరుపతి అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారని అర్ధం లేని ఆరోపణలు చేస్తున్నారని, చట్టానికి లోబడే ఈ నిధులు కేటాయించిన వాస్తవాన్ని అర్ధం చేసుకోవాలన్నారు. తిరుపతికి టిటిడి కేటాయించే నిధులు శాశ్వతం కావాలని, చట్టరూపంలో రావాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

జగనన్న మార్టులలో కొనాలని

ఒత్తిడి మానుకోవాలి...

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పొదుపు సంఘ సభ్యులకు ప్రతినెలా రూ.10వేలకి తగ్గకుండా జగనన్న మహిళా మార్టలలో నిత్యావసర వస్తువులు కచ్చితంగా కొనాలనే నిబంధన పెట్టడం దారుణమని వెంటనే మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్‌లో మెప్మా ద్వారా రూరల్‌లో డిఆర్‌డిఎల ద్వారా మహిళా సంఘ సభ్యుల నుండి మార్టలలో ప్రతినెలా రూ.2వేలు, 3వేలు కొనాలని నిబంధనలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కొనుగోలు చేయకపోతే బ్యాంకు లింకేజీ రుణం ఆపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. జిల్లా అధికారులు మాత్రం బలవంతం చేయడం లేదని ఓ పక్క చెబుతున్న మెప్మా ఆర్పీలు సిఓలకు నగరపాలక సంస్థ అధికారులు జారీ చేయడం, డిఆర్‌డిఏల్లో ఏపీఎంలు, సీసీలు పసుపుపొడి, మిరపపొడి ఇతర వస్తువులు టార్గెట్లు పెట్టి ఒత్తిడి తీసుకురావడం సరైనది కాదన్నారు. పప్పు దినుసులు, బియ్యం, పాలపదార్థాలు, శీతల పానీయాలు తదితర నిత్యావసరాలు డ్వాక్రా మహిళలకు కొంత ధర తగ్గించే ఇస్తామని చెప్పిన అమలు కావడం లేదు ప్రైవేటు కిరాణా దుకాణాలు మాల్స్‌లలో ఉన్న ధరలతో సమానంగానే ఇక్కడ విక్రయిస్తున్నారు. మరి అలాంటప్పుడు ఎక్కడైనా కొనుక్కోవచ్చు కదా ఈ ఒత్తిడి తీసుకురావడం ఏమిటని మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి సంఘంలోనూ పది మంది మహిళలు కచ్చితంగా నెలలో ఒకసారి వేయి రూపాయలు కొనుగోలు చేయాల్సిందేనని ఆదేశాలు ఇవ్వడం దారుణమని అన్నారు. కొన్ని వస్తువులు అయితే నాణ్యతలేని వస్తువులుగా ఉన్నాయని అలాంటివి కూడా ఒత్తిడి తీసుకురావడం, కొనకపోతే రుణాలు లింకు పెట్టడం సిగ్గుచేటు అని, జిల్లా ఉన్నతాధికారులు కింది స్థాయిలో జరుగుతున్న వాటిని సమగ్రంగా పరిశీలించాలన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి బలవంతపు కొనుగోలు వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళలను సమీకరించి మార్టల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అత్తమామల వేధింపులపై ఫిర్యాదు

పోలీసులు ఎదుటే మహిళపై భర్త దాడి

- పట్టించుకోని పోలీసులు - జాతీయ రహదారిపై నిరసన

ప్రజాశక్తి- పుంగనూరు: భర్త, అత్త, మామలు వేధిస్తున్నారని పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది, దీనిపై స్పందించకపోగా పోలీసుల ఎదుట మహిళపై భర్తతో కలిసి వారు దాడి చేశారు. ఈ విషయంపై పోలీసులు స్పందించకపోవడంతో ఆమె జాతీయ రహదారిపై తన బిడ్డతో సహా శనివారం నిరసనకు దిగింది. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మైనార్టీ మహిళ ఎస్.షాన్వాద్ తనకు పెళ్లి అయినప్పటి నుంచి భర్త, అత్త, మామ, భర్త సోదరి, ఆమె భర్త అందరూ కలిసి వేధిస్తున్నారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు తనకు న్యాయం చేయకపోగా వారి ముందే అందరూ కలిసి తనపై, బిడ్డపై దాడి చేస్తున్న పోలీసులు చూస్తూ ఉండిపోయారని ఆరోపించింది. తనకు న్యాయం కావాలని పోలీసు స్టేషన్‌కు వెళ్లితే పోలీసులు న్యాయం చేయకుండా తనపై వారి కుటుంబ సభ్యులు దాడి చేసిన భర్త కుటుంబ సభ్యులకు అండగా నిలిచారని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీస్ స్టేషన్లో తనకు న్యాయం జరగదని తెలిసి తీవ్ర మనస్తాపానికి గురై తన రెండేళ్ల బిడ్డతో కలిసి జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపింది. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి తనకు, తన బిడ్డకు న్యాయం చేయాలని కోరింది.

జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపిన మహిళ

● 16 నుంచి స్వీకరణ ప్రారంభం

ఆకర్షణీయమైన వడ్డీతో ధరణి డిపాజిట్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఆకర్షణీయమైన వడ్డీతో ధరణీ డిపాజిట్లను ఈనెల 16వ తేదీ నుండీ ప్రారంభించనుంది. డిపాజిట్ల సేకరణ కోసం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఖాతాదార్లకు శుభవార్త ప్రకటించింది. 46 రోజుల పాటు డిపాజిట్లను సేకరించనున్నారు. జిల్లా సహకర బ్యాంకులో డిపాజిట్లు చేసి రూ.8ల వడ్డీ పొందాలని, ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మ, బ్యాంకు సీఈవో మనోహర్‌గౌడ్ కోరుతున్నారు. డిపాజిట్లు, ఇతర వివరాల కోసం స్థానిక సహకర కేంద్ర బ్యాంకు బ్రాంచ్‌లను సంప్రదించాల్సి ఉంటుంది.

జిల్లా సహకరా కేంద్ర బ్యాంకు ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మ

సీనియర్ సిటిజన్స్‌కు 8.50 శాతం వడ్డీ

కనిష్ట ధరణి డిపాజిట్ రూ.1000లకు పైబడి స్వీకరించబడుతుంది. సీనియర్ సిటిజన్స్‌కు 0.50 శాతం అదనపు వడ్డీ అందనుంది. డిఐసిజిసి ఇన్సూరెన్స్ రక్షణ కల్పించనున్నారు. జిల్లా సహకర కేంద్ర బ్యాంకలో పొదుపు చేయడం ద్వారా వాణిజ్య బ్యాంకుల కంటే అదనపు వడ్డీ పొందే అవకాశం కల్పిస్తున్నారు.

సైట్ మార్టగేజ్ లోన్స్...

జిల్లాలోని మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బ్రాంచ్‌లలో లోన్లు అందిస్తున్నారు. కనీస లోను పరిమితి రూ.3లక్షలు, గరిష్ట లోను పరిమితి రూ.15లక్షలు లోనుపై 13శాతం తక్కువ వడ్డీతో అందిస్తున్నారు. లోను పరిమితి 72మాసాల్లో ఈఎంఐ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.

రూరల్ హౌసింగ్ మార్టగేజ్

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రూరల్ హౌసింగ్ మార్టగేజ్ రుణాలను జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా అందిస్తున్నారు. రూ.3 లక్షల నుండీ 10లక్షల వరకు 13 శాతం వడ్డీతో గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల తనఖా పెట్టేవారికి రుణాలు అందించనుంది. 72 నెలల్లో ఈఎంఐ ద్వారా తీసుకున్న రుణాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

ట్రేడర్స్ -ఎస్‌హెచ్‌జీలకు..

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బ్రాంచ్‌ల్లో వ్యాపార అవసరాల కోసం రూ.50 వేల నుండీ రూ.3లక్షల వరకు 12శాతం వడ్డీతో అందించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు అర్హతను బట్టి రూ. 2లక్షల నుండీ రూ. 20లక్షల వరకు ఎటువంటి డాక్యుమెంట్, ప్రాసెస్సింగ్ ఛార్జీలు లేకుండా 9శాతం (75 పైసలకు) రుణాలు అందిస్తోంది.

జిల్లా సహకర కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయం

హౌస్ మార్టగేజ్, గృహనిర్మాణ రుణాలు

మేజర్ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఉన్న అన్ని బ్రాంచ్‌ల్లో గృహ మార్టగేజ్ రుణాలు రూ.3లక్షల నుండీ రూ.20 లక్షల వరకు అందిచనున్నారు. 13శాతం వడ్డీతో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. రూ.10లక్షల లోను కాలపరిమితి 96మాసాలు, రూ.10లక్షలకు పైబడిన రుణాలకు కాలపరిమితి 120మాసాల్లో చెల్లించాల్సి ఉంటుంది. గృహ నిర్మాణాల కోసం అందించే రూ.5లక్షల నుండీ రూ. 40 లక్షల రుణాలు 9శాతం తక్కువ వడ్డీతో 120 మాసాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువ వడ్డీతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి (జిల్లా సహకార కేంద్రబ్యాంకు) ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మ పిలుపునిచ్చారు.

'కోత'ల్లోనూ కోతలే..!

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అసలే ఉక్కిరిబిక్కిరి చేస్తున్న విద్యుత్ చార్జీలు, పైగా అదనపు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు రకరకాల పేర్లతో మరో బాదుడు. దీనికి తోడు ఇష్టానురాజ్యంగా విద్యుత్ కోతలు. పట్టణాల్లో సైతం తప్పని అంతరాయాలు. డిస్కం పరిధిలో ప్రతి ఊర్లోనూ రోజూ కోతలు ఉన్నా.. అబ్బే అవేమి లేవే, నిరంతరాయంగా 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామంటూ అధికార యంత్రాంగం కోతలు కోయడం గమనార్హం. ప్రభుత్వంలో మార్పు రాకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదంటూ వామపక్షాలు హెచ్చరిస్తున్నాయి.

ఏపిఎస్‌పిడిసిఎల్ తిరుపతి కేంద్రంగా పని చేస్తూ ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు విద్యుత్ సరఫరా అందిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ. లక్షా 18,119 కిలోమీటర్ల విస్తీర్ణంలో 94,12,063 డొమెస్టిక్ సర్వీసులు, 10,00,777 నాన్ డొమెస్టిక్ అండ్ కెమికల్ సర్వీసులు, 74,784 ఇండస్ట్రియల్ సర్వీసులు, 17,097 కాటేజీ ఇండస్ట్రీస్ అండ్ దోబీఘాట్స్ సర్వీసులు, 14,75,846 వ్యవసాయ కనెక్షన్లు, 11,7829 పిడబ్ల్యుఎస్, స్ట్రీట్‌లైట్ సర్వీసులు, 82,955 జనరల్ పర్పస్ సర్వీసులు, 55,320 ఆక్వా, అనిమల్ హస్‌బెండ్రీ అండ్ అదర్ సర్వీసులు, 1,026 టెంపరరీ సర్వీసులు, 1,22,37,597 ఎల్‌టిసర్వీసులు, 7,116 హెచ్‌టి సర్వీసులకు విద్యుత్ సరఫరా చేస్తూ, 2228 33/11 కెవి సబ్‌స్టేషన్లు, 784330 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 8589 11కెవి ఫీడర్స్, 48 డివిజన్లు, 166 సబ్‌డివిజన్లు, 648 సెక్షన్లతో, 132 ఈఆర్వోస్, సబ్ ఈఆర్వోస్ సామర్థ్యంతో పని చేస్తున్న సంస్థ. ప్రజలందరికి విద్యుత్ సరఫరా అందించడంలో ఎస్‌పిడిసిఎల్ సిబ్బంది నిరంతరాయంగా పని చేస్తోంది. కానీ ప్రభుత్వ ధోరణి, అధికారులు తీరు వల్ల ప్రజలకు కరెంట్‌తో కష్టాలు తప్పడం లేదు. పెరిగిన విద్యుత్ చార్జీల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు 2016లో వాడిన కరెంట్‌కు సైతం ట్రూఅప్ చార్జీలు, అదనపు చార్జీల పేరుతో అధిక భారాలు మోపుతున్నారు. అరాకొర అనుకుంటే పొరబాటే. 200, 300 రూపాయలు నెల బిల్లు వచ్చే గృహ వినియోగదారులకు మూడు రెట్లు ఎక్కువగా రూ.700 నుంచి రూ.900 రూపాయలు కరెంట్ బిల్లు వస్తుంది. కరెంట్ పట్టుకుంటే షాక్ కొట్టడం మాట దేవుడెరుగు. ఇపుడు కరెంట్ బిల్లు పట్టుకుంటేనే వినియోగదారులకు షాక్ కొడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్నామని జబ్బలు కొట్టుకుంటున్న అధికారులు గత కొంతకాలంగా అనధికార కోతలు విధిస్తుండడం శోచనీయం. మారుమూల ప్రాంతాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ కాదు సుమా ఏకంగా పట్టణాలు, నగరాల్లోనూ రోజుకు ఐదు గంటల మేర అనధికార విద్యుత్ కోతలు పెడుతుండడం గమనార్హం. ఒక పక్క చార్జీల భారం, మరోపక్క కరెంట్ కోతలు తప్పడం లేదు. ఇదేమని ఏకంగా డిస్కం చైర్మన్‌ను ప్రశ్నిస్తే విద్యుత్ కోతలనేవి లేవు అంటూ కోతలు కోస్తుండడం విడ్డూరం. ఫలాన ప్రాంతాల్లో..ఫలానా సమయం కరెంట్ లేదని సాక్ష్యాధారాలతో నిరూపిస్తే..'అది విద్యుత్ సరఫరాలో చిన్న అంతరాయం, ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది, చెట్లు కొడుతుండడం వల్ల కరెంట్ కొద్ది సమయం నిలిపేశారంటూ' కప్పదాటు సమాధానాలు చెప్పి తప్పించుకుంటున్నారు. ఎక్కడైన సమస్య ఉంటే 1912కు ఫిర్యాదు చేయండి, వెంటనే పరిష్కరిస్తామంటూ వినియోగదారులను మెప్పించే ప్రయత్నం చేస్తుండడం కొస మెరుపు. వాస్తవానికి విద్యుత్ వినియోగానికి సరిపడా విద్యుత్ ఉత్పత్తి లేక డిస్కంలు ప్రత్యామ్నాయ మార్గాల బాట పట్టాయి. వినియోగదారుల దృష్టి మళ్లించేందుకు అనధికార కోతలకు సిద్ధమయ్యాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఒక పక్క అదనపు బాదుడు, మరో పక్క అనధికార కోతల వల్ల వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కరెంట్ చార్జీలను నియంత్రించి, వినియోగదారులకు న్యాయం చేయాలంటూ వామపక్ష పార్టీలు ఏకమై పోరుబాట పట్టాయి. ప్రభుత్వ ధోరణిలోనూ, అధికారుల తీరులోనూ మార్పు రాకపోతే మరో బషీర్‌బాగ్ ఘటన తప్పదని హెచ్చరిస్తున్నాయి. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అదనపు బాదుడు తగ్గిస్తుందని వినియోగదారులు వేచి చూస్తున్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పూర్వికుల ఆత్మశాంతి కలగాలని కరణం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మహాలయ పక్ష అమావాస్య సందర్భంగా మొగిలి కామాక్షి సమేత మొగలీశ్వర స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రవీంద్రప్రసాద్, ఉప కార్యదర్శి శంకర్, సభ్యులు రామయ్యపెళ్లై, రవిచంద్ర, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్యపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని చౌడిరెడ్డిపల్లెలో ఏర్పడ్డ దారి సమస్యపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో గ్రామస్తులు మాట్లాడుతూ బత్తినపల్లి నుంచి పత్తికొండకు వెళ్లే దారిని కురవపల్లివాసులు తవ్వే శారని ఆరోపించారు. కురవపల్లివాసులు ఆ భూమి తమదని అటువెళ్లడానికి అవకాశం లేకుండా అడ్డుగా తవ్వేయ్యడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. అదే దారిలో శ్మశానం, వ్యవసాయ పొలాలు ఉండడంతో అటు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నామని వివరించారు. పూర్వికుల నుంచి ఇదే దారిలో నడుస్తుంటే ఉద్దేశపూర్వకంగా దారి లేకుండా చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-పులిచర్ల: మండలంలోని వగ్గివారిపల్లెకు చెందిన రమణారెడ్డి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, కన్వీనర్ నాధమునిరెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ నాగరాజప్రసాద్ తదితరులు ఉన్నారు.

పాలవెల్లువ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: జగనన్న పాలవెల్లువ పథకం అమలుకు త్వరితగ సర్వే పూర్తి చేయాలని ఎంపిడివో రాజేంద్రబాలాజీ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ 21 పంచాయతీలలో 14 కార్యదర్శులు, 192 మంది వలంటీర్లు సర్వేలో పాల్గొంటారన్నారు.

కబడ్డీ పోటీలకు కోచింగ్ క్యాంపు

ప్రజాశక్తి-నగరి: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల చౌడేపల్లెలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యారన్నారు. ఎంపికైన వారికి తర్ఫీదు ఇచ్చేందుకు ఈ నెల 16నుంచి 24వ తేదీ వరకు పుంగనూరు బిఎంఎస్ క్లబ్‌లో క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఆటగాళ్లు తప్పకుండా హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9440934507 నెంబరుకు సంప్రదించాలన్నారు.

టిడిపి నేతకు ఘన నివాళి

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లికి చెందిన టిడిపి నేత రమేష్ గౌడ్ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల నాయకులు రమేష్‌గౌడ్ మృత దేహానికి నివాళులు అర్పించి, ఆయన కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, భాస్కరాచారి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి పద్మనాభ రెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి - చిట్టమూరు: మండలంలోని వైసిపి నాయకుల వాకాడు లో శనివారం నిర్వహించిన ఏఎస్‌సీ మాజీ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు నేదురుమల్లి పద్మనాభ రెడ్డి పెద్దకర్మ క్రియల్లో గూడూరు శాసనసభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కొడవలూరు సుబ్బారెడ్డి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ రూప్ కుమార్ యాదవ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చంచల్ బాబు యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు పనబాక కృష్ణయ్య, వైసిపి నాయకులు కోటిరెడ్డి మధు రెడ్డి, వంకా రామానుజనాయులు, చిట్టమూరు మాజీ జడ్‌పిటిసి వంకా రమణయ్య, మాజీ సర్పంచ్ దేవరెడ్డి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : జవహర్ నవోదయ విద్యాలయల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుకు చివరి గడువు అక్టోబర్ 31 వరకు ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ యన్ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని,11వ తరగతికి దరఖాస్తు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ తరగతులకు దరఖాస్తు చేసుకునేందుకు 2023 – 24 విద్యా సంవత్సరం ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాల, బాలికలు అర్హులని తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2009 మే 1 నుంచి 2011 జూలై 31 మధ్య జన్మించి ఉండాలని, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుండి 2009 జూలై 31 మధ్యన జన్మించి ఉండాలని, పరీక్ష తేదీ 10 ఫిబ్రవరి 2024న ఉంటుందన్నారు. వివరాలకు 8688888802, 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉపేంద్ర రాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న కె. ఉపేంద్రరాజుకు వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీలో 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఎన్ క్రిప్షన్ అల్గారిథం ఇన్ రివర్స్ బిల్ డేటా హైడింగ్ యూజింగ్ వేవలెట్ ట్రాన్స్ ఫామ్స్ అండ్ కన్వల్యూషన్ న్యూరల్ నెట్‌వర్క్' అనే అంశంపై డాక్టర్ ఎన్ ఉమామహేశ్వర్ పర్యవేక్షణలో పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు విట్ యూనివర్సిటీ వేలూరు వారు ఉపేంద్రరాజుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఉపేంద్ర రాజుకు డాక్టరేట్ రావడం పట్ల సహచర అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

జనసేనపై అక్రమ కేసులకు సిపిఐయం ఖండన

తిరుపతి టౌన్: తిరుపతిలో మీడియా సమావేశం జరుగుతుండగా అక్రమంగా ప్రెస్ క్లబ్ లోకి చొరబడి ముఖ్యమంత్రిని విమర్శించారన్న ఒకే ఒక్క కారణంతో తీవ్రమైన నాలుగు రకాల ఐపిసి సెక్షన్లు మహిళలపై నమోదు చేసి, హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన తిరుపతి పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐయం రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను హరించడానికి వైసిపి ప్రభుత్వం పూనుకోవడం దారుణమని విమర్శించారు. గతంలో టిడిపి కార్యకర్తలు దిష్టిబొమ్మను దహనం చేశారని హత్యా ప్రయత్నం కేసులు పెట్టారని, ఇప్పుడు మహిళల్ని కనీస విచక్షణ మరిచిపోయి హత్యాయత్నం కేసు నమోదు చేయడం ప్రభుత్వ దుందుడుకుతనాన్ని, నిరంకుశ తీవ్రతను తెలియజేస్తోందన్నారు.

'రవీంద్ర భారతి'లో దసరా సంబరాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి కొర్లగుంట మారుతి నగర్ లో ఉన్న రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి దసరా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ బి రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ హిందూ సంప్రదాయాన్ని పాటించాలని అన్నారు. భారతీయ సంప్రదాయాన్ని ఆచరించడంలో తెలుగువారు ముందున్నారన్నారు. ఊర్మిళ బొమ్మల కొలువులు పెట్టి పూజలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు.

బాబు ఆరోగ్యం పట్ల తమ్ముళ్ల ఆందోళన

- వివిధ చోట్ల ఆలయాల్లో పూజలు
- వి.కోటలో బైక్ ర్యాలీ

జైలులో టిడిపి అధినేత చంద్రబాబు ఆరోగ్యం క్షీణిస్తోందన్న సమాచారంతో ఆ పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం జిల్లాలో వివిధ చోట్ల పూజా కార్యక్రమాలు, ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు చేశారు.

ప్రజాశక్తి-వి.కోట: ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసుల వల్ల చంద్రబాబు జైల్లో ఉన్నారని, అక్కడ ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేదంటూ టిడిపి మండల కన్వీనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో వి.కోట నుండి కర్నాటక రాష్ట్రం బంగారు తిరుపతి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు ధీరజ్ నేతృత్వంలో పట్టణంలోని దుర్గమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వెదురుకుప్పం: చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలోని జక్కిదొన పంచాయతీలో శనివారం టిడిపి శ్రేణులు బాబు కోసం మేము సైతం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌మురళి, లోకనాథరెడ్డి, నరసింహ యాదవ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. టిడిపి మహిళా నేతలు చెన్నూరిగారిపల్లిలో ఆంజనేయస్వామికి పూజలు చేశారు. నాయకులు చిట్టెమ్మ, తులసమ్మ, సుగుణమ్మ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై తక్షణమే ప్రభుత్వం

వి.కోటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

బాధ్యత వహించాలని మండలంలోని కృష్ణజీమ్మాపురం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శనివారం టిడిపి నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, రాజేంద్రన్ వాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ, ఆయన

ఎస్ఆర్ పురంలో పూజలు చేస్తున్న నేతలు

ఆరోగ్యం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ముస్లిం, మైనార్టీ నాయకలు ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు.

ఎస్ఆర్‌పురం: మండలంలోని క్షీరసముద్రంలో చంద్రబాబు కోలుకోవాలని మండల కన్వీనర్ జయశంకర్ నాయుబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మునిరత్నంనాయుడు, కుమార్, రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

బిసి సర్పంచ్‌కి ఇదేనా మీరిచ్చే గౌరవం?

ప్రజాశక్తి-పలమనేరు: గంగవరం మండలంలో నిర్వహించిన పలు ప్రభుత్వ కార్యక్రమాలలో తనను అవమానించారని కీలపట్ల పంచాయతీ సర్పంచ్ చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పలమనేరు టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెండు రోజుల ముందు గంగవరంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి తనకు సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. స్థానిక సర్పంచ్ లేకుండా అధికారులు అధికారిక కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారంటూ ప్రశ్నించారు. బిసిలంటే ఈ ప్రభుత్వానికి నేతలకు పడదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ పాటించని అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ సోమశేఖర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

మాట్లాడుతూ ప్రజా ప్రతినిధికి అధికారులు, అధికార పార్టీ ఇచ్చే గౌరవం ఇదేనా అని మండిపడ్డారు. అదే విధంగా ఇంటింటి టిడిపి కార్యక్రమంలో పెద పంజాణి మండలం శివాడి గ్రామంలో ఏర్పాటుచేసిన పార్టీ జెండాలు, తోరణాలను తొలగించడాన్ని ఖండించారు. కార్యక్రమంలో నాయకులు రవి, వెంకట రమణారెడ్డి, గోవిందరాజులు, గణేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువ ఏర్పాటు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయనపల్లి లోని ఎస్సీ కాలనీలో నూతన డ్రైనేజీ కాలువలను శనివారం సర్పంచ్ రేణుక శంకర్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో సమస్య తెలుసుకొని వెంటనే నిర్మాణ చర్యలు చేపట్టిన సర్పంచ్‌ని గ్రామస్తులు అభినందించారు.

దసరాకు ఊరు వెళ్లేవారు పోలీసులకు తెలపాలి: ఎస్ఐ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: దసరా పండుగకు సొంతగ్రామాలకు వెళ్లేవారు పోలీసులకు తెలిపి వెళ్లాలని ఎస్ఐ వెంకట నరసింహం తెలిపారు. ఎస్ఐ వెంకట నరసింహం బుచ్చినాయుడు కండ్రిగ ప్రజలకు పలు సూచనలు చేశారు. దసరా సందర్భంగా స్వగ్రామానికి వెళ్లేవారు తప్పకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలిపి వెళ్లాలన్నారు. లేదంటే తిరిగి వచ్చాక కంగుతినే పరిస్థితి ఎదురు కావచ్చన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయే అవకాశం ఉంటుందన్నారు. గతంలో పండుగలకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళ్లిన వారి ఇళ్లలో దొంగలు మొత్తం దోచుకుపోయిన ఘటనలు ఉన్నాయని, తరచూ పండుగల సమయంలో ఇలాంటి సంఘటనలు జరుతున్నాయని తిరిగి వచ్చాక దొంగతనంపై ఫిర్యాదులు అధికంగా అందుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురవకుండా ముందుగానే స్థానిక పోలీస్ స్టేషన్లో తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ బాలకృష్ణ, రీగన్ సురేష్, శరత్ యాకోబు, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింహ గర్జన గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు రూరల్: నూర్ బాషాల ఆశయ సాధనాల కోసం అక్టోబర్ 29 వ తేది ఆదివారం సాయంత్రం గుంటూరులోని ఆంధ్ర ముస్లిం కాలేజీ రాష్ట్ర నూరుబాషా సంఘం ఆధ్వర్యంలో సింహగర్జన సభను పురస్కరించుకుని శనివారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సలీమ్ భాయ్ మాట్లాడుతూ సింహ గర్జన సభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి నూర్ బాషా ప్రతినిధులు, నూరుబాషా సోదరులు, మహిళలు హాజరవుతున్నారని తెలిపారు. నెల్లూరు జిల్లాలోని అన్ని మండలాల నాయకులు, నగర, జిల్లా, మహిళా, యూత్ కమిటీ, రాష్ట్ర నాయకులందరూ హాజరై ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. చట్ట సభలలో నూర్ బాషాలకు అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే, ఎంపి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మైనారిటీ పదవులలో వర్గీకరణ దామాషా ప్రకారం నూర్ బాషాలకు పదవులు కేటాయించాలన్నారు. చట్ట సభలలో ఏ పార్టీ నూరు బాషాలకు అవకాశం ఇస్తుందో ఆ పార్టీకే సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రసిడెంట్ షేక్ దిల్ షార్, గూడూరు మండల అధ్యక్షులు షేక్, చాంద్ బాషా, గూడూరు యూత్ అధ్యక్షులు షేక్ బాబా బాయ్, గూడూరు యూత్ ఉపాధ్యక్షులు షేక్ ఇబ్రహీమ్, షేక్. జిలాని, షేక్ ఖాదర్ బాబా, షేక్ ఖయ్యూమ్, టైలర్ షేక్ చాంద్ బాషా, షేక్ సుబాన్, షేక్ దూది నజీర్, షేక్, ఖాదర్ బాషా, షేక్ సలీమ్, షేక్ జైనుద్దీన్ పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

ప్రజాశక్తి -రామచంద్రపురం: దేవి నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని సిరామాపురం లోని బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమంలో ఆదివారం నుంచి 9 రోజులు పాటు జరిగే దేవి నవరాత్రి ఉత్సవాలకు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేశారు. రాయలచెరువు కట్ట సమీపాన ఉన్న శ్రీ శక్తి పీఠం, రాయల చెరువు కట్ట కింద ఉన్న భవాని శంకరాలయంలో ఉత్సవాలకు ఆలయ నిర్వహకులు విద్యుత్ దీపాలంకరణ, చలువ పందిళ్ళు, మామిడి తోరణాలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. సోమవారం ఉదయం నుంచి కనక దుర్గాదేవి ఉత్సవ విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు బ్రహ్మశ్రీ గురూజీ ఆశ్రమ నిర్వాహకులు రాంప్రకాష్, రాధాకృష్ణన్లు తెలిపారు. ఈ దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు, నిర్వహించనున్నట్లు తెలిపారు.

పభుత్వ మద్యం షాపు ఏర్పాటుపై దళిత నాయకుల ఆందోళన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలకు వెళ్లే రహదారి మధ్యలో సర్కారి మద్యం దుకాణం ఏర్పాటు పై స్థానిక దళిత నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో సుమారు 600 మంది పైగా విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని.ప్రతి ఆదివారం వారిని చూసేందుకు వారి తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో మహిళలు ఈ రహదారిపై వెళుతున్నారని వాపోయారు. అయితే ఈ ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్థానిక వైసిపి నాయకులు స్పందించి మద్యం దుకాణం వేరే చోట ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కోట బిట్ వన్ ఎంపీటీసీ దారా సురేష్, బిట్ 3 ఎంపీటీసీ షంషుద్దీన్, కొత్తపాలెం ఎంపీటీసీ నారాయణ, టీడీపీ నాయకులు అనీల్, తిరుమూరు మురళి, విన్నమాల అనొక్, వాటంభేటీ చెంగల్ రావు పాల్గొన్నారు.

గంజాయి రవాణా పట్టివేత

పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి - గూడూరు: తిరుపతి ఎస్పీ పి పరమేశ్వర్ రెడ్డి తిరుపతి జిల్లా డిఎస్ఇఇ (ఎస్ఇబి, సెబ్) ఎ రాజేంద్ర ఆదేశాల మేరకు గూడూరు ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలలో గంజాయిపై గూడూరు సెబ్ టీమ్ శనివారం తనిఖీలు నిర్వహిం చారు. ఈ తనిఖీలలో గంజాయి కలిగి ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తిని (ఎ1)ను అరెస్టుచేసి అతని వద్ద నుండి 3 కేజీ ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మరో ఇద్దరు వ్యక్తులను (ఏ 2, ఏ 3)లను గుర్తించారు. ఒడిశాలోని మల్కాన్ గిరికి చెందిన ఈశ్వర్ మడ్కామి ఎ1గాను, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు గ్రామానికి చెందిన మౌలాలి అలియాస్ ఆలీ ఎ2గా, బెంగళూరుకు చెందిన మనోజ్‌,ను ఎ3గాగుర్తించారు. ఎ2, ఎ3 లు ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామని వివరించారు. నిందితుల కథనం మేరకు.. స్నేహితుడైన (ఏ 2) మౌలాలి వద్ద నుండి (3) కేజీల గంజాయిని తీసుకుని బెంగళూరులో ఉన్న ఎ3 మనోజ్‌కు గంజాయిని చేరవేస్తే ఈశ్వర్ కు మౌలాలి అనే వ్యక్తి రూ.5వేలు ఇస్తాడని తెలిపారు. బెంగుళూరులో ఈ గంజాయి విలువ ఒక్కో కేజీ 20 వేల రూపాయలు ఉంటుందని అంచనా. దీని విలువ మొత్తం 60 వేల రూపాయలు ఉంటుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న అందరినీ త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా సమాచారం తెలిసిన వారు టోల్ ఫ్రీ నెంబర్ 14500కు తెలపవచ్చన్నారు. ఈ దాడులలో గూడూరు సెబ్ టీమ్ గూడూరు సెబ్ టీం బీ సీఐ , పి విజయ్‌కుమార్, ఎస్ఐ ఏ శేషమ్మ, హెచ్ సి యమ్ కిరణ్ సింగ్, పి రమేష్ , ఎస్ కె బాష, టీజీ ఆనందబాబును ఉన్నతాధికారులు అభినందించారు.

ర్యాలీలతో రచ్చకెక్కిన నగరి పొలి'ట్రిక్స్'

- దాడి చేశారని ఒకరు.. అది నాటకమని మరొకరు
- టిడిపి, వైసిపి నేతల బాహాబాహి

ప్రజాశక్తి-నగరి: ప్రశాంత నగరి నియోజకవర్గంలో రాజకీయక్రీడ ఆరంభమైనట్లే తెలుస్తోంది. రాజకీయం రచ్చకెక్కి ఘర్షణ వాతావరణం నెలకొల్పింది. ఇన్నాళ్లు అధికారిక కార్యక్రమాలతో బిజిబిజిగా గడిపారు మంత్రి ఆర్‌కే రోజా. పార్టీ కార్యక్రమాలతో కేడర్‌ను ఉత్తేజింప జేసే పనిలో పడ్డారు టిడిపి అభ్యర్థి భానుప్రకాష్. అంతా భాగానే ఉన్నా.. శుక్రవారం నగరి పర్యటనలో ఉన్న టిడిపి నేత భానుప్రకాష్‌పై వైసిపి నాయకులు దాడికి పాల్పడ్డారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పార్టీ శ్రేణులతో కలసి భానుప్రకాష్ ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అయితే శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నీ దొంగ నాటకలే భానువి అంటూ కేవీపీఆర్ పేట నుంచి ఓంశక్తి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి రోజాకు జై కొడుతూ టిడిపి నగరి అభ్యర్థి భానుప్రకాష్‌పై నిప్పులు చెరిగి విమర్శనాస్త్రాలు విసిరారు. ఈ సందర్భంగా మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జగనన్న సురక్ష నిర్వహణ కోసం ఆస్పత్రి వద్ద ఉన్న వైసిపి నాయకులను చూసి పారిపోతూ వాహనాన్ని వెనక్కు తిప్పుకొని లారీని ఢీకొని పరుగులు తీసిన భానుప్రకాష్ మందుమీదున్న నలుగురు పచ్చతమ్ముళ్ల పక్కన రావడంతో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ దిగజారుడు రాజకీయాలకు తెరతీశారన్నారు. గత చరిత్ర గురించి ఆయన మాట్లాడుతున్నారని రోజమ్మది ఆయనలా కన్న తండ్రి మరణానికి కారణమైన చరిత్ర కాదన్నారు. కన్న తల్లే ద్వేషించుకునే చరిత్ర కాదన్నారు. మహిళలను అగౌరవంగా మాట్లాడే నీచ సంస్కృతి ఉన్న చరిత్ర కాదన్నారు. నీ భాగోతమంతా మాకు తెలుసని విమర్శించారు. సినిమాల్లోను, రాజకీయాల్లోను ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని స్వశక్తితో, పట్టుదలతో కష్టపడి ఎదిగిన

మీడియాతో మాట్లాడుతున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

రోజమ్మది నిప్పులాంటి చరిత్ర అన్నారు. మరోమారు వ్యక్తిగత దూషణలు చేస్తే దాడి చేశారని ఆడుతున్న నాటకాన్ని నిజం చేస్తామన్నారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, నగరి, పుత్తూరు, నింద్ర ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకష్ణ తదితరులు ఉన్నారు.

దాడి ఘటనలో 9మందిపై కేసు నమోదు

టిడిపి నాయకులు శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో వైసిపి నాయకుడుకి చెందిన వాహన షోరూంపై దాడి చేసిన ఘటనలో పోలీసులు 9 మందిపై కేసు నమోదు చేశారు. ఈ విషయంగా శనివారం సిఐ సురేష్ వివరాలను వెల్లడించారు. షోరూం యజమాని శరవణ్ ఇచ్చిన ఫిర్యాదుతో టిడిపి నాయకులు ఈఎన్ శ్రీనివాసన్ (కేవీపీఆర్ పేట), జె.శివకుమార్ (మాంగాడు), ధీనదయాళ్ (ముడిపల్లి), తులసిలింగం, ఎంఎం చంద్రశేఖర్, (ఏకాంబరకుప్పం) కన్నయ్య (ఏకాంబరకుప్పం దళితవాడ), టిఎం.మాణిక్యవాసన్, విపి హరి, కేఎం వడివేలు (పుదుపేట)పై కేసు నమోదు చేశామన్నారు. జరిగిన ఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

అధికారీ.. పరిష్కారమేదీ..!

- రహదారిపై మురుగునీరు
- స్పందన కోసం సోషల్ మీడియాలో విమర్శలు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం పురపాలక పరిధిలో పారిశుధ్యం పడకేసింది. పలు చోట్ల డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దలవాయి కొత్తపల్లి, అర్బన్ కాలనీలలో ఈ సమస్య అధికంగా ఉంది. పారిశుధ్యం సమస్య అనగానే సాధారణం అనిపించినా పట్టించుకోని అధికారులపై స్థానికులు మాత్రం సోషల్ మీడియాను వేదిక చేసుకొని పోటోలను పోస్ట్ చేస్తూ సమస్య మా పరిధిలో ఉందంటే.. అవును మా వీధులోనూ ఇలానే ఉందంటూ రచ్చ చేస్తున్నారు. అధికారులకు చెప్పినా పరిష్కారముండదంటూ

విమర్శనాస్త్రాలను విసురుతున్నారు. అధికారుల తీరు, ప్రజాప్రతినిధుల వ్యవహారం పట్ల హాశ్యాస్పదంగా నెట్టింట చర్చించుకుంటూ కామెంట్ చేస్తున్నారు. ఏదేమైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మానసిక ధైర్యంతోనే క్యాన్సర్ నిర్మూలన : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : మానసిక ధైర్యంతోనే క్యాన్సర్ నిర్మూలించవచ్చని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య డి భారతి పేర్కొన్నారు. వర్సిటీ స్టూడెంట్ అఫైర్స్, హెల్త్ సెంటర్, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, టాటా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా శుక్రవారం ఇంజినీరింగ్ కళాశాలలోని ధృతి కాన్ఫరెన్స్ హాల్‌లో 'నేషనల్ పాలియేటివ్ కేర్ డే అండ్ బ్రెస్ట్ క్యాన్సర్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య భారతి మాట్లాడుతూ మానసిక ధైర్యం, కచ్చితమైన అవగాహనతో క్యాన్సర్‌ని నిర్మూలించవచ్చన్నారు. క్యాన్సర్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా టాటా క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ పనిచేస్తోందన్నారు. కేన్సర్ బాధితులకు నాణ్యమైన పరికరాలతో ఉచిత సేవలు అందిస్తూ ఎంతో మంది ప్రాణాలు కాపాడు తోంద న్నారు. మహిళల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో టాటా సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజిని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వ్యాపిస్తున్న క్యాన్సర్‌లలో బ్రెస్ట్ క్యాన్సర్ మొదటి స్థానంలో ఉందన్నారు. మనిషి జీవన శైలి, జన్యువులు, పర్యా వరణ ప్రభావం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. కుటుంబ సభ్యులు క్యాన్సర్ రోగులను చాలా జాగ్రత్తగా చూసుకోవాలని సూచిం చారు. టాటా క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు రవికిరణ్, సంధ్య మాట్లాడుతూ క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుర్తించాల్సిన విధానాలను వివరించారు. స్టూడెంట్ రిలేషన్స్ డీన్ ఆచార్య కాత్యాయిని, హెల్త్ సెంటర్ అధికారి అనన్య మాట్లాడుతూ బ్రెస్ట్ క్యాన్సర్ పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, క్యాన్సర్ బారిన పడినా ధైర్యంగా ఎదుర్కొంటే సులువుగా బయటపడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాభవాని, ఆంగ్ల విభాగం ఆచార్యులు వై శారద, నిర్మల, విద్యార్థినులు పాల్గొన్నారు.

మైక్రోబయాలజిస్ సదస్సు బ్రౌచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, డిపార్టుమెంట్ ఆఫ్ అప్లైడ్ మైక్రో బయాలజీ అండ్ బయోటెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 22– 23,2023 నిర్వహించబోయే అంతర్జాతీయ సదస్సు 'బయోటెక్ మైక్రోన్ : షాపింగ్ ద సస్టైనబుల్ ఫ్యూచర్ " అనే అంశంపై బ్రౌచర్ ను ఉప కులపతి ఆచార్య డి. భారతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విసి ఆచార్య డి.భారతి మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధకులు తమకున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్తమమైన సమాచారాన్ని అందించే పరిశోధనలు సమాజానికి అందించేందుకు ఈ అంతర్జాతీయ సదస్సు తోడ్పడు తుందన్నారు. ఇటువంటి అంతర్జాతీయ సదస్సులలో పాల్గొనడం ద్వారా నాణ్యమైన పరిశోధనా పత్రాలు అందిం చడంతోపాటు, పరిశోధన అభివృద్ధి మక్కువ, ఆసక్తి పెరుగుతుందన్నారు. కన్వీనర్ కన్వీనర్లు ఆచార్య పి. జ్యోత్స్న, ఆచార్య ఆర్. జయ మాధురిలు మాట్లా డుతూ అంతర్జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలను పంపించేందుకు సువర్ణ అవకాశం ఉందన్నారు. సదస్సు బ్రౌచర్ ను మహిళా వర్సిటీ వెబ్సైట్లోని అందుబాటులో ఉంచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సువర్ణలతాదేవి,ఆచార్య ఆర్. ఉష, ఆచార్య చండీ కుమారి, ఆచార్య ఎన్.జాన్ సుష్మ, ఆచార్య బి. కిషోరి పాల్గొన్నారు.

శివయ్యా... నీవే సాక్ష్యం..!

సెల్‌ఫోన్ టార్చి వెలుతురులో రాహుకేతు పూజలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం రాహు కాల సమయంలో ఓ గంట పాటు శివయ్య భక్తులకు కరెంటు కష్టాలు వచ్చాయి. రెండవ శనివారంతో పాటు మహాలయ అమావాస్య కావడంతో రాహు–కేతు సర్పదోష నివారణ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రెండవ శనివారం కావడంతో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్ శాఖ వారు సరఫరా ఆపేశారు. ఈ సమయంలో ఆలయం వద్ద ఉన్న జనరేటరు పని చేయక పోవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో రాహు–కేతు మండపాల్లో ఉన్న భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ లేక పోవడంతో రాహు–కేతు మండపాలు చీకటి కమ్ముకున్నాయి. కొంతమంది భక్తులు మండపాల్లో పని

చీకట్లో రాహుకేతు పూజలు

చేసే ఆలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది భక్తులు రాహు కాల సమయం దాటి పోకుండా తమ సెల్‌ఫోన్లలో టార్చ్ లైట్లు ఆన్ చేసుకుని పూజలు ముగించుకోవడం జరిగింది. గంట తరువాత ఆలయ అధికారులు జనరేటరు మరమ్మతు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో భక్తులు, ఆలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా ప్రతి నెలా రెండవ శనివారం ఇలా విద్యుత్ సమస్య ఉత్పన్నమవుతుందని అంతా తెలుసు. అయినా ఆలయ అధికారులు జనరేటర్ పనిచేస్తుందో లేదో ముందస్తుగా సరిచూసుకోవడంలో నిర్లక్ష్యం వహించారు. ఫలితంగానే ఇలాంటి సమస్య వచ్చిందంటూ భక్తులు మండిపడ్డారు.